# తీవ్రవాదం

కస్తూరి మురళీకృష్ణ

**తీవ్రవాదం**

**-కస్తూరి మురళీకృష్ణ**
e-mail: kmkp2025@gmail.com
blog : www.kasturimuralikrishna.wordpress.com

ప్రథమ ముద్రణ
**ఏప్రియల్, 2009**

మూల్యం : రూ. **100/-**

అక్షరాలంకరణ
**పల్లవిగ్రాఫిక్స్**
ఫోన్ : 99480 33493

ముద్రణ
**సాయిలిఖిత ఆఫ్‌సెట్ ప్రింటర్స్**
హైదరాబాద్

ప్రచురణ
**కస్తూరి ప్రచురణలు**
ప్లాట్ నెం. 32, రఘురామ్‌నగర్ కాలనీ,
దమ్మాయిగూడ
హైదరాబాద్ - 500083
ఫోన్ : 040-27120899
Cell : 9849617392

# ముందుమాట

ప్రజలను, ప్రభుత్వాలను భయభ్రాంతులను చేయటం ద్వారా తమ కోరికలను సాధించేవారు భయోత్పాతవాదులు. ప్రస్తుత సమాజంలో వీరిని తీవ్రవాదులుగా పరిగణిస్తున్నారు. హింస ద్వారా భయం కలిగించి కోరికలను సాధించటాన్ని 'టెర్రరిజం' అంటున్నారు.

'టెర్రరిజం' అన్న పదానికి 100కు పైగా నిర్వచనాలున్నాయి. 'టెర్రరిజం' అన్న పదాన్ని వాడటం కూడా వివాదాస్పదమే. ఎందుకంటే అధికారంలో ఉన్నవారి దృష్టికి తీవ్రవాదంగా కనిపించేది, పోరాడేవారి దృష్టికది స్వతంత్ర పోరాటం, కోరికల సాధన పోరాటం. రాజకీయ లబ్ధికోసమో, సామాజిక, వ్యక్తిగత అణచివేతలకు వ్యతిరేకతనో, హక్కుల సాధనకోసమే తమ అభిప్రాయమే అందరూ ఒప్పుకోవాలన్న పట్టుదలనో వ్యక్తిని హింసవైపు తీవ్రవాదంవైపు మళ్లిస్తుంది.

'టెర్రర్' అన్నపదం లాటిన్ నుంచి వచ్చింది. భయపెట్టడం అని అర్థం. టెర్రర్ సింబ్రికస్' అన్న పదాన్ని క్రీ.పూ. 105వ శతాబ్దంలో, సింబి తెగల వారు రోముపై దాడి చేసినప్పుడు రోము ప్రజలలో కలిగిన కలకలాన్ని వర్ణించేందుకు వాడారు. ఫ్రెంచి విప్లవం సమయంలో ప్రజలను అణచివేసేందుకు ప్రభుత్వం ఈ పదాన్ని వాడింది. 1869లో రష్య విప్లవ సంస్థ 'దరోగ్న్య రస్ప్రావా'ను స్థాపించిన 'సెర్గియ్ నెబియేవ్' తనని తాను 'తీవ్రవాది'గా ప్రకటించుకున్నాడు.

ఆధునిక యుగంలో, సాంకేతికాభివృద్ధి విపరీతమై, మారణాయుధాల శక్తి పెరిగింది. తయారీ పెరిగింది. అవి లభ్యమవటమూ సులభమయింది. దాంతో కోరికల సాధనకు తీవ్రవాదం ఒక సులభతరమైన మార్గమైంది.

ఒకదేశంలోని సాయుధ పోరాట దళాలు, మరో దేశంలో తీవ్రవాదులతో పొత్తులు కుదుర్చుకోవటం, సహాయ సహకారాలు అందించుకొంటుండం మానవ మనుగడను ప్రమాదంలోకి నెడుతోంది.

సెప్టెంబరు 11, 2001న అమెరికాపై తీవ్రవాదుల దాడి జరగడంతో ప్రపంచం దృష్టి తీవ్రవాదంపై పడింది. అంతవరకూ ఏ దేశానికాదేశం తీవ్రవాదాన్ని తమ అంతర్గత సమస్యగా భావిస్తూ వచ్చేది. కానీ ఆరోజు నుంచీ తీవ్రవాద వ్యతిరేక పోరాటం ప్రపంచానిదయింది. తీవ్రవాదం ప్రపంచ వ్యాప్తమయింది. ప్రతిదేశం ఏదో ఓ రూపంలో తీవ్రవాదాన్ని ఎదుర్కొవాల్సి వస్తుంది.

అయితే, తీవ్రవాదానికి మతాన్ని ముడిపెట్టటంతో తీవ్రవాదాన్ని అణచటం క్లిష్టతరమౌతోంది. ప్రజలను తీవ్రవాదంవైపు మళ్లించటం సులభతరమౌతోంది. ప్రజల మనోభావాలను రెచ్చగొట్టి, మామూలు సంఘటనలను మహత్తరమైన విస్ఫోటనాత్మకాలుగా మార్చడం తీవ్రమౌతోంది.

ఇలాంటి పరిస్థితులలో తీవ్రవాదం గురించి అది ఆవిర్భవించి, వ్రేళ్లూనుకుని, విశ్వమంతా వ్యాపించే విషవృక్షంలా ఎదగడం గురించి తెలుసుకోవాల్సిన ఆవశ్యకత ఎంతయినా ఉంది.

సమస్యను మూలాల్లోకి వెళ్లి విశ్లేషించటం వల్ల, అది వ్యాప్తమౌతున్న కారణాలను గ్రహించటం వల్ల, పరిష్కార మార్గాల అన్వేషణ వీలవుతుంది. సంఘటన జరిగిన కాలంలోనే పూర్వాపరాలు విశ్లేషిస్తూ, భవిష్య ప్రణాళికలను, ఫలితాలను ఊహిస్తూ రాసిన ఈ వ్యాసాల సంకలనం 'తీవ్రవాదం' సమస్యను అవగాహన చేసుకోవడంలో పరిష్కారాలను ఆలోచించటంలో తోడ్పడుతుందన్నది నా ప్రగాఢ విశ్వాసం.

తీవ్రవాదాన్ని ప్రాంతీయ సమస్యగా కాక సమస్త ప్రపంచ సమస్యగా పరిగణిస్తేకానీ పరిష్కారం వీలుపడదు. ఈ వ్యాస సంకలనంలో ప్రపంచం నలుమూలలా విస్తరిస్తున్న తీవ్రవాదం గురించి విశ్లేషణ ఉంది. ఆయా దేశాలలో తీవ్రవాదం ఆరంభమవటానికి కారణాలు, విస్తరించటానికి దారితీసిన పరిస్థితుల గురించి వివరణ ఉంది. సమస్య జటిలమౌతూ ప్రపంచాన్ని ప్రమాదంలోకి నెట్టడం గురించిన సమాచారం ఉంది. పరిష్కారాల సూచన ఉంది. అందుకే ఈ వ్యాసాలు సంఘటనలు జరిగిన కాలంలో రాసినవే అయినా సమస్యను అవగాహన చేసుకోవటంలో తోడ్పడతాయి.

2001 వ సంవత్సరం ఆంధ్రభూమి వారపత్రిక సంక్రాంతి సంచికతో 'పవర్ పాలిటిక్స్' శీర్షిక ఆరంభమయింది. శీర్షిక ఆరంభించే సమయంలో, ఆంధ్రభూమి న్యూస్ ఎడిటర్ శ్రీమతి ఎ.ఎస్. లక్ష్మిగారు 'ప్రయోగాత్మకంగా ఓ మూడునెలలు చూసి, పాఠకులకు నచ్చితే కొనసాగిద్దాం, లేకపోతే ఆపేద్దాం' అని అన్నారు.

సాధారణంగా పాఠకులు రాజకీయాల వార్తల కోసం దినపత్రికలు చదువుతారు. వారపత్రిక పాఠకులు తాజా రాజకీయాల కోసం వారపత్రికలపై ఆధారపడరు. ఎందుకంటే, వ్యాసం రాసిన రెండు వారాలకు కాని సంచిక వెలువడదు. కాబట్టి, రెండు వారాల తరువాత కూడా ప్రజలు ఆసక్తిగా చదవగలిగే అంశాన్ని ఈ శీర్షికన రాసేందుకు ఎంచుకోవాల్సి ఉంటుంది. ఎంచుకున్న అంశం గురించి వార్తాపత్రికరీతిలో సమాచారం ఇవ్వటం కాకుండా, ఇతర వార్తలకు భిన్నంగా, విపులంగా చర్చిస్తూ అనలైజ్ చేయాల్సి ఉంటుంది. అంశానికి సంబంధించిన ఇతర ఆసక్తికరమైన అంశాలను 'బాక్స్'ల్లో ఇవ్వాల్సి ఉంటుంది. ఈ రకంగా 'రీడబిలిటీ' పెంచవచ్చు. పైగా, వ్యాసం క్లిష్టంగా ఉండకూడదు. సరళంగా ఉండాలి.

'పవర్ పాలిటిక్స్' అని శీర్షికకు నామకరణ చేసి, శీర్షిక పరిమితులను వివరించి, అంశాలను ఎంచుకొనే విధానం, వాటిని ప్రజెంట్ చేసే విధానంలో పూర్తి స్వేచ్ఛనిచ్చిన శ్రీమతి ఎ.ఎస్.లక్ష్మి గారికి హృదయపూర్వక కృతజ్ఞతాభి వందనాలు.

'పవర్ పాలిటిక్స్' శీర్షిక నిర్వహణ, నా రచనా జీవితంలో టర్నింగ్ పాయింట్‌గా భావిస్తాను. సప్తస్వరాలపై పట్టు సాధిస్తే, ఏ రాగాన్నయినా అవలీలగా గానం చేయవచ్చుంటారు. అలాగే, అంశాల్ని ఆకర్షణీయంగా ప్రజెంట్ చేయటం తెలిస్తే ఎలాంటి అంశం గురించయినా ఆసక్తికరంగా రాసి మెప్పించవచ్చన్న సత్యం నాకు బోధపడింది ఈ శీర్షిక నిర్వహణ వల్లనే.

'పవర్ పాలిటిక్స్' రచనతో కలిగిన ఆత్మవిశ్వాసంవల్లనే నేను వివిధ పత్రికల్లో విభిన్నాంశాల గురించి విస్తృతంగా రాసి పాఠకులను మెప్పించ గలుగుతున్నాను. అందుకే ఇతర రచనలు ఎన్నిచేసినా, 'పవర్ పాలిటిక్స్' శీర్షిక నా హృదయంలో ప్రత్యేక స్థానాన్ని ఆక్రమిస్తుంది. వ్యక్తిగత ప్రతిభ ఎంత ఉన్నా, దాన్ని గుర్తించి, ప్రోత్సహించి, ప్రదర్శించే వీలునివ్వందే అది అడవిగాచిన వెన్నెల అవుతుంది. అందుకే, ఆంధ్రభూమి వారపత్రిక సంపాదక వర్గానికి మనస్ఫూర్తిగా మరోసారి కృతజ్ఞతలు.

ఎంచుకున్న అంశం లోతుల్లోకి వెళ్ళి, పుట్టుపూర్వోత్తరాలనుంచీ వివరించటం వల్ల ఈ వ్యాసాలు ఎల్లప్పటికీ ఉపయోగపడేరీతిలో రూపొందాయి. ఏదైనా సమస్య గురించి తెలుసుకోవాలంటే రిఫరెన్స్ వ్యాసాల్లా ఉపయోగ పడతాయి. వ్యాసాల ఈ లక్షణాన్ని గుర్తించిన మిత్రుడు కె.పి. అశోక్‌కుమార్, పుస్తక ప్రచురణకు ప్రోత్సహించటమేకాదు, 2001 నుంచి 2008 వరకు ప్రచురితమైన వ్యాసాలను, సబ్జెక్ట్ ప్రకారం వర్గీకరించి, కూర్చి ఇచ్చాడు. అశోక్‌కుమార్ సహాయంలేకపోతే పవర్ పాలిటిక్స్ వ్యాసాలను వర్గీకరించి, ప్రచురించవచ్చన్న ఆలోచన వచ్చేదేకాదు.

రచయితలు రచనలు ఒంటరిగానే చేసినా, అవి వెలుగు చూసి, ప్రజలకు చేరువయి, చిరకాలం నిలవాలంటే ఎంతోమంది సహాయం అవసరం. వారం వారం వ్యాసాల రచనతోపాటు నాతోపాటు ప్రసవవేదనను అనుభవించి, వ్యాసం పూర్తవగానే ఏదో గొప్పపని పూర్తయినట్టు, 'రిలీఫ్' పొందే నా భార్య పద్మ, అమ్మ, సోదరి మాలినిలకు కృతజ్ఞతలు.

ప్రస్తుతం దేశాన్ని పీడిస్తున్న ప్రమాదకరమైన సమస్య తీవ్రవాదం. 2001 నుంచి 'పవర్ పాలిటిక్స్' శీర్షికన ప్రచురితమైన తీవ్రవాద సంబంధిత వ్యాసాల సంకలనం ఇది. ఈ వ్యాసాలు తీవ్రవాదానికి కారణాలు, పరిష్కార మార్గాల గురించి అవగాహన కలిగించగలవని నా నమ్మకం. ఒక క్లిష్ట సమయంలో వ్యక్తికి నిజానిజాలు వివరించి, ఆలోచనలు కల్పిస్తుందీ సంకలనం అన్నది నా విశ్వాసం. నా విశ్వాసం ఎంతవరకూ సమంజసమో పాఠకులే తీర్పు చెప్పాలి.

పుస్తకాన్ని అందంగా తీర్చిదిద్దిన పురుషోత్త్ కుమార్, ప్రచురించిన... లకు కృతజ్ఞతలు. ఈ పుస్తకంపై మీ అభిప్రాయాల్ని నిర్మొహమాటంగా తెలపాలని ప్రార్థన

**– కస్తూరి మురళీకృష్ణ**

## కస్తూరి మురళీకృష్ణ ఇతర రచనలు

**నవలలు**

అసిధార

అంతర్మథనం

మర్మయోగం

**కథలు**

రియల్‌స్టోరీస్

జీవితం - జాతకం

కల్హణ కశ్మీర రాజతరంగిణి కథలు

4×5

**కాల్పనికేతర రచనలు**

భారతీయ తత్త్వచింతన - ఒక లఘు పరిచయం

భారతీయ వ్యక్తిత్వవికాసం

మన ప్రధానమంత్రులు

మన ముఖ్యమంత్రులు

1857 - మనం మరవకూడని మహాయుద్ధం

అక్షరాంజలి

# విషయక్రమం


| | | |
|---|---|---|
| 1. | ఆఫ్ఘన్‌లో గొడవలకి మతం ముసుగు | 9 |
| 2. | తీవ్రవాదంపై ఉక్కు పాదం తప్పదు | 17 |
| 3. | ఉగ్రవాదం ప్రాంతీయ సమస్య కాదు, ప్రపంచానికే సమస్య! | 27 |
| 4. | కొందరిది అవసరం, ఇంకొందరిది అభద్రతాభావం | 36 |
| 5. | శాంతి సాధనకు 'కాల్పుల విరమణ' చాలా? | 44 |
| 6. | శాంతివైపు సరికొత్త ఆఫ్ఘన్? | 52 |
| 7. | రాజకీయాలకి ఆదర్శాల ముసుగులు | 59 |
| 8. | తాడోపేడో తేల్చుకోవాల్సిన తరుణమిదే! | 66 |
| 9. | శాంతి ఒప్పందానికి ఇజ్రాయిల్ ససేమిరా! | 74 |
| 10. | ప్రగల్భాలు కాదు, పరిణతి కావాలి | 81 |
| 11. | రాజకీయాల్లోనూ బాధ్యత కనిపించాలి | 89 |
| 12. | ఆఫ్ఘన్‌లో అంతర్యుద్ధానికి అంతమెప్పుడు? | 99 |
| 13. | ఇండోనేషియాను కబళిస్తోన్న తీవ్రవాదం | 106 |
| 14. | ఈ విద్వేషానికి విరుగుడు ఐకమత్యమే! | 111 |
| 15. | చొరబాట్లతో చిచ్చు రగిలిస్తున్న బంగ్లాదేశ్ | 118 |
| 16. | ఇంత ఆలోచనారాహిత్యమా? | 123 |
| 17. | అంతఃకలహాలతో అల్లాడుతున్న లైబీరియా | 132 |
| 18. | ఉగ్రవాదంపై ఇంత ఉదాసీనతా? | 138 |
| 19. | భారత్ శాంతి పాటకి జవాబు తూటాలా? | 144 |
| 20. | తీవ్రవాదం ప్రబలేందుకు కారణాలనేకం | 150 |
| 21. | అంతటా విస్తరిస్తున్న తీవ్రవాద విషవృక్షం | 156 |
| 22. | అభద్రతాభావంలో స్పెయిన్ ప్రజానీకం | 162 |
| 23. | ప్రశ్నార్థకంగా మారిన శ్రీలంక శాంతి ఒప్పందం | 168 |
| 24. | శాంతి సాధన దిశగా సూడాన్ | 175 |

| | | |
|---|---|---|
| 25. | తీవ్రవాదుల పడగనీడలో ఇండోనేషియా | 182 |
| 26. | చెచెన్యా తీవ్రవాదంలో రాజకీయ ప్రయోజనాలు | 188 |
| 27. | శాంతి మంత్రం వెనక కుతంత్రం | 195 |
| 28. | తీవ్రవాదం అణచివేతలో కనపడని చిత్తశుద్ధి | 203 |
| 29. | భయం నీడలో భాగ్యనగరం | 211 |
| 30. | శాంతియుత పరిష్కారం కోరుతున్న మణిపూర్ | 218 |
| 31. | నివురుగప్పిన నిప్పు 'తీవ్రవాదం' | 225 |
| 32. | ఆధిపత్యం పోరులో తీవ్రవాదం జోరు | 232 |
| 33. | తిప్పి కొట్టిన పాక్ మత రాజకీయాలు | 237 |
| 34. | సంక్షోభంలో దేశ భద్రత | 245 |
| 35. | ప్రభుత్వాన్ని సవాలు చేస్తున్న తీవ్రవాదం | 251 |
| 36. | నేతల అలసత్వం – తీవ్రవాదానికి జవసత్వం! | 257 |

# ఆఫ్ఘన్‌లో గొడవలకి మతం ముసుగు

> **భ**గవంతునిపై విశ్వాసం లేని వారి హృదయాలను భయంతో నింపుతాం. అల్లా అనుమతి లేకుండా వారు అల్లాకు అనుచరులను అంటగడతారు. అటువంటి వారు నిప్పుల్లో నివసిస్తారు. వారి ఇళ్ళు నరకాలవుతాయి.
>
> **–పవిత్ర ఖురాన్ (సురా 3–151)**

అఫ్ఘనిస్తాన్‌ను ఇస్లాం మయం చేద్దామనీ, ఇతర మతస్తుల విగ్రహాలను ధ్వంసం చెయ్యాలనీ తాలిబన్ నాయకుడు ముల్లా ఒమర్ ఇచ్చిన పిలుపు, ఆ తరువాత జరుగుతున్న విధ్వంసం చూస్తుంటే 'ఖురాన్'లోని పై వాక్యాలు గుర్తుకు వస్తాయి. ఎందుకంటే ప్రస్తుతం అఫ్ఘన్ ప్రజలు నిప్పుల్లో నివసిస్తున్నారు. వారి దేశం నరకప్రాయం అయింది.

ఖురాన్‌లో అడుగడుగునా భగవంతుడి వాక్యాలకు దుర్వ్యాఖ్యానం చేసేవారి గురించి, కుహనా ప్రవక్తల గురించి హెచ్చరికలున్నాయి. ప్రస్తుతం ప్రపంచంలో 'ఇస్లాం' పేరిట చెలరేగుతున్న హింసాకాండ, 'భగవంతుడి సేవ'లో భాగంగా చారిత్రక కట్టడాలపై జరుగుతున్న దాడి, ఏ దుష్టశక్తుల విషయంలో అప్రమత్తంగా ఉండమని 'ఖురాన్' తన అనుయాయులను హెచ్చరించిందో ఆ దుష్టశక్తులే 'ఇస్లాం' పేరిట విలయతాండవం చేయటాన్ని నిరూపిస్తుంది.

అఫ్ఘనిస్తాన్‌లో ప్రస్తుతం జరుగుతున్న సంఘటనలలో 'మతం' ఒక ముసుగు మాత్రమే. దీని వెనుక అనేక రాజకీయ కుట్రలున్నాయి. అంతర్జాతీయంగా సూపర్ పవర్స్, అఫ్ఘన్ ప్రజలతో ఆడిన చదరంగం ఆటల దుష్ఫలితాన్ని ఇప్పుడు మనం ప్రత్యక్షంగా చూస్తున్నాం.

## ఆరంభంలో....

చారిత్రాత్మకంగా అఫ్ఘనిస్తాన్ ఆధునికతను ఆదినుంచీ వ్యతిరేకిస్తూ మధ్యయుగపు ఇస్లాంనే అనుసరిస్తూ వస్తోంది. రష్యా, బ్రిటన్‌లు కలిసి అనేక ట్రైబల్ రాజ్యాలను 'అఫ్ఘనిస్తాన్'గా పందొమ్మిదవ శతాబ్దంలో ఏర్పరచారు. నిజానికి అఫ్ఘనిస్తాన్‌లో ఇస్లాం 750వ సంవత్సరంలో అబ్బాసిద్ ఆవిర్భావంతో పెద్దఎత్తున ప్రవేశించింది. 1000 నుంచి 1215 వరకు ఘోరి వంశం అఫ్ఘన్‌పై

రాజ్యం చలాయించింది. 16వ శతాబ్దంలో 'బాబర్' కాబూల్ నుంచి భారత్ చేరి మొఘల్ సామ్రాజ్యాన్ని ఆరంభించాడు. అప్పటినుంచి మొఘల్, సఫావిద్ వంశాలు అఫ్ఘన్‌పై అధికారం కోసం పోరాడుతూ వచ్చాయి. అఫ్ఘన్ వీరుడు అహ్మద్‌షా అబ్దాలి, నాదిర్‌షా అఫ్సర్‌ను చంపి అఫ్ఘన్‌పై అధికారాన్ని సాధించాడు. 'దుర్-ఎ-దురానీ' అన్న బిరుదు ధరించి మొఘలు, సఫావిద్‌ల నుంచే కాక 'తాజిత్'ల భూమిని కూడా గెలుచుకున్నాడు.

ఆ తరువాత అఫ్ఘనిస్తాన్ కోసం బ్రిటన్, రష్యాల మధ్య పోరు ప్రారంభమయింది. విదేశీయుల ఆక్రమణ అఫ్ఘన్‌లకు చేదు అనుభవం. ఈ అనుభవం వల్ల ఆధునికత అన్నా, పాశ్చాత్య పద్ధతులన్నా ద్వేషం ఏర్పడింది.

### అబ్దుర్ రహమాన్

ఈ నేపథ్యంలో అఫ్ఘన్ నాయకత్వాన్ని అబ్దుర్ రహమాన్ చేపట్టాడు. అధికారంలోకి రాగానే ఈయన అఫ్ఘన్ చుట్టుపక్కల ఉన్న చిన్న చిన్న ట్రైబల్ రాజ్యాలతో పోరు ప్రారంభించాడు. అక్కడ

## బమియాన్ బుద్ధ-బాబ్రి మసీదు

మనదేశంలో కొందరు ముస్లిం మత నాయకులు బమియాన్ బుద్ధుడి విగ్రహంపై దాడిని బాబ్రీమసీదు ధ్వంసంతో పోల్చి తాలిబన్ చర్యను సమర్థించి, భారత ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టాలని చూస్తున్నారు. ఇది దేశవ్యాప్తంగా ప్రతి పౌరుడు గర్హించవలసిన చర్య. ఈ చర్య వల్ల దేశంలో విద్వేషాగ్నులు ప్రజ్వరిల్లే ప్రమాదం ఉంది. ఎందుకంటే ఈ వ్యాఖ్యను ఆధారం చేసుకుని దేశంలో ముస్లింలపై ద్వేషాన్ని రెచ్చగొట్టే ప్రమాదం వుంది. అదీగాక తాలిబన్‌ల చర్య బాబ్రీమసీదు ధ్వంసానికి ప్రతిచర్యగా వ్యాఖ్యానించటం అర్థరహితం. ఈ రెంటికీ పోలిక లేదు.

బాబ్రీమసీదు ధ్వంసమైన వెంటనే దేశంలో తీవ్రమైన నిరసన హిందువుల వైపు నుంచి వ్యక్తమయింది. రాష్ట్ర ప్రభుత్వం రద్దయింది. నాయకులపై కోర్టులో కేసులు నడుస్తున్నాయి. కానీ ఆఫ్ఘన్‌లో ఇటువంటి స్పందన కనబడటం లేదు. పైగా ఇతర దేశాల మొరలను కూడా తాలిబన్లు చెవిన పెట్టడం లేదు.

ఇక్కడే మరో విషయం వుంది. ఎప్పుడయితే తాలిబన్ చర్యకు దేశంలో ముస్లిం నాయకుల సమర్థన లభిస్తుందో, అప్పుడు బాబ్రీ మసీదు ధ్వంసమే కాదు, ఇతర అటువంటి కట్టడాల ధ్వంసానికి కూడా సమర్థన లభిస్తుంది. అందుకే నాయకులు విచక్షణతో బాధ్యతాయుతంగా ప్రవర్తించాలి. ఎలా తోస్తే అలా ప్రకటనలు చేయటం వల్ల అమాయకులు బలి అవుతారు. దేశం అల్లకల్లోలమవుతుంది.

వారిని ఇస్లాం మతానికి మార్చాడు. వారందరినీ మతం పేరిట ఒకటి చేసి ఇతర రాజ్యాల పైకి ఉసిగొల్పాడు. ఈరకంగా అఫ్ఘనిస్తాన్‌ను 99శాతం ఇస్లాం మయం చేసాడు.

అయితే 'అబ్దుర్‌రహమాన్' హయాంలో 'ఇస్లాం'ను స్వీకరించిన అనేక జాతులవారు అంతకు పూర్వం తమ పద్ధతులను పూర్తిగా విడనాడలేదు. 'పుష్తున్‌వాలి' ఇందుకు ఉదాహరణ. అలాగే సూఫీలయిన 'ఖద్రియా', 'నబంది'లను 'ఉలామా'లు ఒప్పుకోకపోయినా ప్రజల ఆదరణను పొందిన పద్ధతులు.

ఈ సమయంలో అబ్దుర్ రహమాన్‌కు సంప్రదాయవాదులైన 'ఉలామా'లతో ఘర్షణ వచ్చింది. దాంతో అబ్దుర్ రహమాన్ తనను 'మతగురువు'గా ప్రచారం చేసుకుని 'షరియత్'పై వ్యాఖ్యానించే హక్కు తనకే ఉందని, 'ఉలామా'లు చెప్పే సూత్రాలను మహమ్మద్ ప్రవక్త ప్రవచించినవి కావని ప్రచారం చేయసాగాడు.

అబ్దుర్ రహమాన్ చర్యకు ప్రతిచర్యగా హబీబుల్లా 'ఇస్లాం' ప్రతినిధిగా ఎదిగాడు.

## అమానుల్లా హయాం-కొత్త పాతల మధ్య ఘర్షణ

అతని తరువాత అధికారాన్ని సాధించిన అమానుల్లా టర్కీతో, ఇరాన్‌తో ఒప్పందాలు చేసుకుని 'మతం' పేరిట ఇతర దేశాలతో సంబంధాలు కలుపుకోవాలని ప్రయత్నించాడు. అయితే దేశాన్ని సరిగ్గా నడిపేందుకు అతను ప్రవేశపెట్టిన పాఠశాలల పద్ధతి, విదేశీ పైలట్ల ఉపయోగం ఉలామాలకు నచ్చలేదు. 1923లో ఇరాన్ రాజ్యాంగం ఆధారంగా, అఫ్ఘన్‌కొక రాజ్యాంగాన్ని తయారు చేశాడు. అయితే అతన్ని భార్య బురఖా లేకుండా కనిపించటం కాబూల్‌లో ఆగ్రహాన్ని కలిగించింది. ఆ తరువాత అతను ప్రవేశపెడుతున్న పాశ్చాత్య పద్దతులు నచ్చని 'ఉలామా'లు అమానుల్లాను గద్దె దింపారు. అతను ప్రవేశపెట్టిన పద్ధతులన్నీ రద్దుచేశారు. మహిళల పాఠశాలలు, పాశ్చాత్య చదువులు అన్నీ బయటకు తోసేసి అఫ్ఘనిస్తాన్ తలుపులు బిగించేశారు. 'సంస్కరణలు వస్తే ఇస్లాం పోతుంది' అన్నది వారి వాదన.

అప్పటినుంచీ అఫ్ఘనిస్తాన్‌లో కొత్త పద్ధతులను నిరసించే మత గురువులకు, ఆధునిక పద్ధతులను ఆహ్వానించే వారికీ మధ్య ఘర్షణ జరుగుతూ వస్తోంది.

## దావూద్‌ఖాన్-నిర్ణయాత్మక సమయం

1953లో అఫ్ఘన్ సైన్యానికి దావూద్‌ఖాన్ కమాండర్‌గా నియమితుడయ్యాడు. రష్యా కమ్యూనిస్టుల సహాయంతో దేశంలో సంస్కరణలను తేవాలని ప్రయత్నించాడు. కానీ అతడిని 'ఇస్లాం వ్యతిరేకి'గా చిత్రీకరించి మత గురువులు ప్రజలను రెచ్చగొట్టారు. అయితే వెంటనే దావూద్‌ఖాన్ అయిదుగురు మతగురువులను అరెస్టు చేయటంతో వారు చల్లబడ్డారు. పాకిస్తాన్ ప్రోద్బలం వల్ల దావూద్ ఖాన్ అధికారం నుంచి తప్పుకోవాల్సి వచ్చింది. కానీ అప్పటికే అఫ్ఘనిస్తాన్‌లో ఆధునికత ప్రవేశించింది.

## అంతర్జాతీయంగా చట్టాలున్నాయి

ఇంటర్నేషనల్ హ్యుమానిటేరియన్ లా అంతర్జాతీయ యుద్ధాలకు వర్తిస్తుంది. ఆర్టికల్ 27, హేగ్ యుద్ధ చట్టం, 1907 ప్రకారం యుద్ధ సమయంలో ఆయా దేశ చారిత్రక కట్టడాలను ధ్వంసం చేయకూడదు.

సాంస్కృతి సంపద రక్షణ చట్టం యునెస్కో 1972లో ఏర్పరచింది. 1979లో అఫ్ఘనిస్తాన్ ఆమోదాన్ని తెలిపింది. 4వ ఆర్టికల్ ప్రకారం సాంస్కృతిక సంపదను రక్షించాలి. కాబూల్ ప్రభుత్వాన్ని బుద్ధ విగ్రహాలను తమకు అందజేయాలని భారత్ కోరటం ఈ చట్టంలో ఆరవ ఆర్టికల్ ప్రకారం ఆమోదయోగ్యం.

అంతర్జాతీయ మానవహక్కుల చట్టం ప్రకారం చారిత్రక, సాంస్కృతిక కట్టడాల పరిరక్షణ ప్రభుత్వాల నైతిక బాధ్యత. ఎప్పుడయితే ఈ చట్టాల ఉల్లంఘన జరుగుతుందో అప్పుడు ఐక్యరాజ్య సమితి రక్షణ సంస్థ, 39వ ఆర్టికల్ ప్రకారం జోక్యం చేసుకోవచ్చు. కానీ ప్రస్తుత పరిస్థితుల్లో అది అసాధ్యం. అందుకే చట్టాలన్నీ భయస్థుడికేనంటారు.

### కమ్యూనిజం–ఇస్లాం మత మౌఢ్యం

ప్రొఫెసర్ నియాజీ కాబూల్ యూనివర్శిటీలో బోధించేవాడు. 'యువ ముస్లింల సంస్థ' ద్వారా ఈయన మతమౌఢ్యాన్ని విద్యార్థులకు నేర్పేవాడు. ఎప్పుడయితే ఆధునిక విద్య ఆరంభమయిందో అప్పుడే మార్క్సిజం అఫ్ఘన్‌లో అడుగుపెట్టింది. దాంతో కాబూల్ యూనివర్శిటీ మార్క్సిస్టులకు, ఇస్లాం ఫండమెంటలిస్టులకు మధ్య రణరంగంలా మారింది. తమ దేశంలో 'హిప్పీ'లు కనిపించటం, పాశ్చాత్యుల అనైతిక ప్రవర్తనను నిరసించిన మత గురువులకు 1972లో 'కరువు' మంచి అవకాశంగా పరిణమించింది. కరువు భగవంతుడి ఆగ్రహంగా చిత్రీకరించి ఆధునికతపై విరుచుకుపడ్డారు.

1973లో దావూద్‌ఖాన్ అధికారం చేపట్టి, షరియత్ ప్రకారం రాజ్యం చేస్తానని ప్రకటిస్తూనే సంస్కరణలను ఆరంభించాడు. అతడికి మార్క్సిస్టుల మద్దతు లభించింది. 1974లో దాదాపుగా 200మంది 'ఇస్లాం సంస్థ' విద్యార్థులను అరెస్టు చేయించాడు. వారి నాయకుడు గుల్బ్‌ఆల్‌దిన్ హెక్మత్యార్ పాకిస్తాన్‌కు పారిపోయాడు. నియాజీ నిర్బంధానికి గురయ్యాడు. రబ్బాని కూడా పాకిస్తాన్‌లో తల దాచుకున్నాడు. అఫ్ఘన్ చరిత్రను భవిష్యత్తులో నిర్దేశించే సంఘటన ఇది.

### పాకిస్తాన్ రంగప్రవేశం

పాకిస్తాన్ చేరిన రబ్బాని, హెక్మత్యార్‌ల మధ్య సయోధ్య కుదరలేదు. నెమ్మదిగా అఫ్ఘన్ మిలటరీని తమ వైపు తిప్పుకోవాలని రబ్బానీ భావిస్తే, తక్షణమే యుద్ధం ఆరంభించాలని హెక్మత్యార్

తొందరపడసాగాడు. అతనికి పాకిస్తాన్ నాయకుడు జుల్ఫికర్ అలీ భుట్టో మద్దతు లభించింది. దాంతో రబ్బాని, హెక్మత్యార్‌లు విడిపోయారు. రబ్బాని జమాత్-ఎ-ఇస్లామీ అనే పార్టీని, హెక్మత్యార్ 'హిజ్బ్-ఎ-ఇస్లామి' అనే పార్టీని స్థాపించారు. వీరిద్దరూ తమలో తాము కలహించుకుంటున్న సమయంలో దావూద్‌ఖాన్, ఇరాన్ షా సహాయంతో భుట్టోతో సంప్రదింపులు ఆరంభించాడు. దావూద్‌ఖాన్ తన దేశంలో నెమ్మదిగా లౌకిక పద్ధతులను ప్రవేశపెట్టడం ఆరంభించాడు. 1977లో స్త్రీ, పురుషులకు సమాన హక్కులను ప్రతిపాదిస్తూ, దేశ వ్యవహారాల్లో 'ఇస్లాం' జోక్యాన్ని తగ్గించాడు. అయితే దావూద్‌ఖాన్ కమ్యూనిస్టులపై కూడా జులుం ప్రదర్శించడంతో 1978 ఏప్రిల్ 28న సైన్యంలోని కమ్యూనిస్టు ఆఫీసర్లు విప్లవం లేవదీశారు. ఫలితంగా దావూద్‌ఖాన్ హత్యకు గురయ్యాడు. నూర్ మహమ్మద్ తారాకీ దేశాధ్యక్షుడయ్యాడు.

## ఏప్రిల్ విప్లవం-పరిణామాలు

నిజానికి ఒకరకంగా చూస్తే దావూద్‌ఖాన్ తన గోతిని తానే తవ్వుకున్నాడనవచ్చు. 1950లో ఆయన ప్రవేశపెట్టిన పథకం ప్రకారం మిలటరీ ఆఫీసర్లలో రష్యాలో శిక్షణ పొందిన వారంతా కమ్యూనిస్టు సానుభూతి పరులవటంలో ఆశ్చర్యం లేదు. కమ్యూనిస్టుల ఈ విప్లవాన్ని 'ఏప్రిల్ విప్లవం' అంటారు.

అధికారం చేపట్టిన వెంటనే తారాకీ, బబ్రాక్ కమాల్ మధ్య విభేదాలు పొడసూపాయి. దేశంలో సంస్కరణలు ప్రవేశపెడుతూ, ఇస్లాం పై తమ విశ్వాసాన్ని ప్రదర్శింపసాగారు. 'బిస్మిల్లా', 'ఇన్షా అల్లా' వంటి పదాలను విరివిగా వాడుతూ, నిరక్షరాస్యతపై 'జిహాద్' ప్రకటించారు. అయితే పాఠశాలల్లో మగ టీచర్లు విద్యార్థినులకి పాఠాలు బోధించడం ఇస్లాం వ్యతిరేకతగా ముల్లాలు ప్రకటించారు. కొత్త పాఠశాలలు 'ముల్లా'ల పాఠశాలలను ప్రమాదంలో పడేశాయి. ప్రభుత్వం 'జండా'నుండి పచ్చరంగును అదృశ్యం చేయటంతో ఇస్లాం మత గురువులు తమ మతం ప్రమాదంలో పడిందని ప్రచారం చేయసాగారు. చివరికి రైతుల పన్నును రద్దు చేయటం కూడా ఇస్లాం వ్యతిరేకతగా వీరు ప్రచారం చేయసాగారు. 1978లో అఫ్ఘన్ ప్రభుత్వం రష్యాతో ఒప్పందం చేసుకుంది. ఈ ఒప్పందం ఆధారంగానే 1979లో రష్యాసేనలు అఫ్ఘన్ దేశంలో ప్రవేశించాయి.

## రష్యా రంగప్రవేశం-అగ్రరాజ్యాల చదరంగం

ఒక వంక అఫ్ఘనిస్తాన్‌లో సంస్కరణలు, వాటి వ్యతిరేకతలు చెలరేగుతున్న సమయంలో అఫ్ఘన్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా గెరిల్లా దళాలు పనిచేయడం ఆరంభించాయి. అఫ్ఘన్ ప్రభుత్వ నాయకులను హత్య చేసే పథకాన్ని హిజ్బ్-ఎ-ఇస్లామి రూపొందించింది. అనేకులు దేశం వదలి పారిపోసాగారు. ఈ సమయంలో రష్యా దళాలు దేశంలో ప్రవేశించటంతో అఫ్ఘన్‌ల అహం దెబ్బతింది. అంతే కాదు అమెరికా దృష్టిని ఈవైపు ఆకర్షించింది. ఫలితంగా, అఫ్ఘన్‌లో రష్యా ఏర్పరచిన ప్రభుత్వానికి వ్యతిరేకంగా సాయుధ పోరాటం జరిపేందుకు అమెరికా సహాయం ఆరంభమయింది. అమెరికా సహాయాన్ని అఫ్ఘన్ పోరాట నాయకులకు అందజేసే దళారి బాధ్యత

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/kbook.php?id=133**